
# ఇంద్రజాలము

కె.యస్. పరబ్రహ్మం



వసంతశోభతో, సర్వాభరణ భూషితమైన సుందర నవవధూమణిలా ప్రకాశిస్తోన్న వీడులలో అమరావతికి సరిజోడగు కొండవీడు. ప్రకృతి ఆరాధకులైన రెడ్డిరాజుల ఏలుబడిలో అనన్య సామాన్యంగా ఎదిగి, తెలుగురాజుల పౌరుష ప్రతాపాలకు ఆలవాలమై, తెలుగు సొబగుల నెలవై, అన్య ప్రాంతీయులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తుతూ, సరిలేని సిరిసంపదల కొలువై, చూపరుల కాశ్చర్యాన్ని కలిగిస్తూ, పరరాజులకు మచ్చరాన్ని కలిగిస్తూ, తన ప్రాభవాన్ని నేల నాలుగు చెరగులకూ విస్తరిస్తూ, విద్యా, వినయ, వివేక సంపన్నుడైన విద్యార్థిలా అంతకంతకూ త్రివిక్రమునిలా ఎదుగుతూ, వొదిగివున్నది కొండవీడు.

మన కథాసమయమున కొండవీటి పాలకుడు కుమారగిరిరెడ్డి చక్రవర్తి. అప్రతిహత విజయాలతో, కొండవీడును దురాక్రమణ చేయాలన్న వాంఛ శత్రువులకు కలలోనైనా రాకుండా చేయడంలో కృతకృత్యులయ్యారు, అంతకుముందు పాలించిన రెడ్డి రాణ్మణులు. ప్రస్తుత కొండవీటికండగా మహావీరుడు, కదన విజయుడు, అరిమత్తేభ సింహమునైన కాటయ వేమారెడ్డి ప్రభువు, మహాసచివ, సర్వసైన్యాధ్యక్ష బాధ్యతలు భుజస్కంధాలపై నిడుకుని, అప్రమత్తంగా దేవ సేనానియే సరిజోడుగా నిర్వహిస్తుండగా, కొండవీటిపై కన్ను బరవడం యేరికైన సాధ్యమా?

కుమారగిరి ప్రభువు, తన బావమరిదియైన కాటయవేముని అండదండలతో, కొండవీడుకు అనంతయశోభూషణాల నలంకరించి, కొండవీటి విఖ్యాతిని భరతఖండము దాటి విస్తరింపచేసినాడు. విదేశాలలో కొండవీటి కీర్తి సుగంధాలను వెదజల్లినవాడు అవచి తిప్పశ్రేష్టి. ఇతడు కొండవీటి ధనాగారానికి కొండంత అండ.

దేశరక్షణ బాధ్యతలో తలమునకలై కాటయవేముడుండగా, భరత మునికృత నాట్యశాస్త్రానికి 'వసంతరాజీయ'మను పేర సుందర వ్యాఖ్యాన రచనలో నిమగ్నమైనారు ప్రభువులు. సంగీత సాహిత్యాలపైన, జానపద కళలపైన కుమారగిరి ప్రభునికి మక్కువయెక్కువ. కాటయవేముడు మాత్రం

సామాన్యుడా? కాళిదాస నాటకత్రయమునకు 'కుమారగిరి రాజీయ'మనే అమృత వ్యాఖ్యను లిఖించి, ప్రభుని కంకితమిచ్చిన దేవభాషావేత్త. ఇట్టి ప్రభువుల పాలనలోని ప్రజలు కూడా సరసులు, సహృదయులుగా ఉండటంలో వింతేమున్నది?

పర్వదినాలను అత్యంత వైభవంగా, వేడుకగా జరుపుకునేవారు ప్రజలూ, ప్రభువులూను. కుమారగిరి ప్రభువుకు ప్రీతిపాత్రమైనది వసంతోత్సవంగా పిలవబడే చైత్రోత్సవం. వసంతకాలమంతా పెద్ద పండగ కొండవీటిలో. ప్రతి పడుచువాడూ అనంగుడే. ప్రతి యువతీ రతీదేవియే. వసంతకాలంలో రాజా స్థానంలో ప్రతిదినం వినోద ప్రదర్శనలు ఏర్పాటయ్యేవి. వీటన్నింటికీ మకుటాయమానమైనవి ముగింపు ఉత్సవం రోజు విద్యా ప్రదర్శనలు, వసంతోత్సవాలపై ప్రభువుకున్న మక్కువ గ్రహించిన ప్రజలాయన్ను 'కర్పూర వసంతరాయలు'గా పిలిచి గౌరవించేవారు.

వసంతోత్సవాల చివరిరోజు కుమారగిరి ప్రభువు భద్రగజాన్నధిరోహించి, వీధినంతా పర్యటించి, ప్రజలకు దర్శనమిచ్చేవారు. ఉత్సవాలకు ముగింపుగా, సువిశాల బహిరంగ మైదానంలో సభాస్థలి నేర్పాటు చేసి ప్రదర్శనలను చూసేవారు. బహుమతులనందించేవారు.

ఆనాడు వసంతోత్సవాల ముగింపు దినం. ప్రత్యూషాన ప్రభువు నగర పర్యటన ముగించుకొని, సభావేదికపై పట్టమహిషి మల్లాంబికా సమేతుడై. సువర్ణ సింహాసనాసీనులైనారు. వక్కనే కాటయవేమ ప్రభువు వెనుక వరుసలో మంత్రి, సామంత, దండనాథ, మండలాధి పురప్రముఖులు సముచితాసనాసీనులై వున్నారు. ప్రభుని ఆజ్ఞతో వినోద ప్రదర్శనలకు ఆరంభ సూచికగా నగారా మ్రోగింది. కొండవీడు నగరమంతా కదలివచ్చింది పిల్లా, పాపల్తో.

మల్లవిద్యా ప్రదర్శన ప్రారంభమైంది. భీమబలులిర్వురు ఒకరికొకరు తీసిపోకుండా విద్యను ప్రదర్శించారు. ఇరువురి భుజాలు తట్టి అభినందించి, బహూకరించారు ప్రభువులు. బరువైన కొండరాతిని వందమంది బలవంతులు మోసికొని రాగా, వెల్లకిలా పడుకుని, రాతిని గుండెలపై నుంచుకొని, బలిష్టమైన ఏనుగును దానిపై కెక్కించుకున్నాడు వీరమల్లుడు. ప్రేక్షకుల గుండెలదరగా. అయిదు నిముషాల తర్వాత ఏనుగును, రాతిని తొలగించగా ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య, కసినందకుండా లేచి వెళ్లి ప్రభు పాదాలను స్పృశించి నిల్చున్నాడు సవినయంగా. ప్రభువునుండి బహుమతిని గ్రహించి నిష్క్రమించాడు.

ఇంతలో దూరంనుండి గుఱ్ఱపుడెక్కల ధ్వని వినవచ్చింది. విద్యా ప్రదర్శన మధ్యలో ఈ అంతరాయమేమిటాని ప్రజలందరూ విస్తుపోతుండగా, అశ్వాలు దాపునకు వచ్చినట్లు హేష విన్పించింది. క్షణాల్లో సభాస్థలి మధ్యలో వచ్చి నిలిచాయి రెండశ్వాలు. రక్షకభటులు వారించే వ్యవధి లేకపోయింది. ఒక అశ్వం పైనుండి వీరయోధుని వేషంలో పత్నీ సమేతంగా దిగాడు. రెండవ అశ్వముపై నుండి నూనూగు మీసాల కుర్రవాడు దిగాడు. వినమ్రులై సభావేదికపై ఉన్న ప్రభువు నమస్కరించి నిలిచారు.

"ఎవరు మీరు? ఆజ్ఞ లేకుండా ఈ



సమయంలో రావాల్సిన అవసరం యేమిటి? ఈ నేరం శిక్షార్హమైనది తెలుసా?" గద్దించారు కాటయవేమ భూపతి.

"ప్రభువులు మా అపరాధాన్ని మన్నించి, నా విన్నపాన్ని చిత్తగించాలి" వేడుకున్నాడు ఆగంతకుడు వినయంగా.

ప్రజలందరి దృష్టి ఆగంతకుని పైనే వుంది. ప్రభువుకూడా ఉత్సుకత యేర్పడ్డది. ప్రభువు సైగ నందుకుని అతడిలా విన్నవించాడు.

"ప్రభూ! నాపేరు వెంకోజి. ఈమె నా భార్య మల్లి. ఇతడు మా పుత్రుడు. మాది సింహపురిసీమ. దాయాదులతో కలహకారణంగా వంచింపబడి, స్వస్థానం విడచి వస్తున్నాము. మార్గమధ్యంలో అడవిలోని ఒక కొలనులో మహాద్భుతతేజంతో వెలుగుతున్న సువర్ణపుష్పాలు కనిపించాయి. వాటి సౌందర్యం వర్ణించనలవి కాదు ప్రభూ! సహజచాపల్యంతో నాభార్య, కొలనులో దిగి పూవుకోయబోగా అన్నీ అదృశ్యమయ్యాయి. ఆశ్చర్యపోయాము. అది మాయగా భ్రమించాము. కొంత దూరం ప్రయాణించి, ఒక రుషీశ్వరుని పర్ణకుటీరం చేరాము. ఆయన సాదరంగా ఆహ్వానించగా, కొద్దిరోజులు వారి సన్నిధిలో గడిపాము. మాటల్లో, కొలను విషయం మునివద్ద ప్రస్తావించగా, అవి ఆకాశగంగలో జన్మించే సువర్ణసూనములనియు, ప్రతి పున్నమకు ఈ కొలనులో కూడా వికసిస్తాయని, మానవస్పర్శ సోకితే మాయమవుతాయని చెప్పారు. అది విన్న నా భార్య జన్మలో ఒక్కసారైనా ఆ పుష్పాన్ని ధరించాలని ముచ్చట పడింది. ఇన్నాళ్ల మా దాంపత్యజీవనంలో ఆమె తొలి కోరిక ఇది. ధీరుడైనవాడు తీర్చవలసిందే కదా! సువర్ణపుష్పాల్ని సాధించే మార్గాన్ని, మునీశ్వరుని ద్వారా తెలుసుకున్నాను. పుష్పాల కోసం నేను వెళ్తే, నా భార్యాబిడ్డల సంరక్షణ ఎలా అని మీ ఆదరణలో వుంచాలని వచ్చాను. తమరు దయతో వీరికాశ్రయం కల్పిస్తే, ఆకాశగంగా తోయజములైన ఆ సువర్ణపుష్పాలను సాధించి తెచ్చి, ప్రభుపాద పద్మములందు సమర్పించుకుంటాను" అని వేడుకున్నాడు నమ్రుడై.

"ఆకాశగంగకు వెళ్లి సువర్ణపుష్పాలు తేవడమా? నమ్మశక్యంగాకుండా వున్నదే?" విస్మయంగా ప్రశ్నించాడు ప్రభువు.

"నిజమే ప్రభూ! మునీంద్రులసత్యం పల్కరు గదా!"

"ఎలా వెళ్లి రాగలవు?"

"ఆ మునీంద్రునిపై భారముంచి. ప్రభువులనుగ్రహిస్తే, పెద్దత్రాడును తెప్పిస్తే, దానిని ఆకాశానికి నిచ్చెనగా వేసి వెళ్లిరాగలను ప్రభూ!"

"ఇదేదో వింతగా వుందే? ఆకాశానికి తాళ్ల నిచ్చెనయా?" ప్రభువు ఆంతర్యం గ్రహించిన అమాత్యుడు త్రాటిని తెచ్చుటకై భటులను పురమాయించాడు.

భటులు కొండవీటిలోని అన్ని అంగళ్లలోనున్న త్రాళ్లను తెచ్చి పడవేశారు. కొండంత గుట్ట ప్రోగయ్యింది.

"వెంకోజీ! నీ భార్యాబిడ్డలు నా ఆశ్రయంలో వుంటారు. నీవిక నిశ్చింతగా వెళ్లి, కార్యసాధకుడవై రమ్మని" ఆజ్ఞనిచ్చాడు ప్రభువు.

నడుముకు చుట్టివున్న దట్టీ నుండి నాగస్వరాన్ని బయటకు తీసి పూరించాడు వెంకోజీ. పాములాగా కదిలి, ఆకాశం వైపు ప్రయాణం ప్రారంభించింది ఒక త్రాడు. ఆ చుట్ట పూర్తికాగానే అలాగే నిలిచి పోయింది శూన్యంలో. నాదస్వరం ఆపకుండానే, ఆ త్రాడు చివర మరొక త్రాడు కొసను గట్టిగా ముడివేశాడు. మొదటిత్రాడు లాగానే ఇది కూడా పైకి వెళ్లింది. ఈవిధంగా అక్కడువున్న గుట్ట మొత్తం పూర్తయ్యింది. త్రాటి మొదలు యెక్కడుందో కన్పించకుండా వుంది శూన్యంలో.

నాగస్వరం ఆపలేదు వెంకోజీ. శిరసువంచి, ప్రభువుకు, సభాసదులకు, ప్రేక్షకులకు నమస్కరించి, అందరూ ఆసక్తిగా చూస్తుండగా, త్రాడు నందుకొని పైకెగ ప్రాకుతూ అంతరిక్షంలోకి అంతర్హితుడైనాడు. నిశ్చేష్టులైనారందరూ.


కొద్దిసేపటి తర్వాత, సభాస్థలంలో విద్యా ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ప్రజల్లో వెంకోజీ ఏమైనాడన్న ఉత్కంఠ ఉన్నప్పటికీ, ప్రదర్శనల్ని ఆస్వాదించసాగారు. మధ్యాహ్నసమయానికి భోజన విరామం ప్రకటించి, ప్రభువులు అంతఃపురానికి వెళ్లడానికి ఉద్యుక్తులవుతున్నంతలో, నింగి నుండి పెద్దయెత్తున కలకలం విన్పించింది. ఆశ్చర్యంతో ఆకాశంవైపు చూస్తున్నారు. త్రాడు అలాగే ఉంది. యుద్ధభేరీధ్వానం విన్పించింది. కత్తుల రాపిడి శబ్దంతో మెరుపులు కన్పించాయి. కొద్దిక్షణాల్లో హాహాకారాలు విన్పించసాగాయి. ఆకాశం నుండి మాంసఖండాలు రాలడం ప్రారంభమయ్యింది. కొద్దిసేపట్లో సభాస్థలం అంతా భీభత్సంగా తయారయ్యింది. రక్తధారలు వర్షించాయి. ఇంతలో "అమ్మా" అన్న వెంకోజీ హృదయవిదారకమైన అరుపు విన్పించి, మరుక్షణంలోనే ఖడ్గాన్ని ధరించిన అతని చేయి ఖండితమై నేలరాలింది. వెంకోజీ భార్యాబిడ్డలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ప్రభువుతో సహా అందరూ చిత్తర్వులైనారు. మరి కొద్దిసేపట్లో నాగస్వరాన్ని పూనిన వెంకోజీ మరో చేయి, ఆ వెంటనే అతని తల, మొండము విడివిడిగా నేలకూలాయి.

సభావేదిక వద్ద నిలుచుని రోదిస్తున్న వెంకోజీ భార్యాబిడ్డలు పరుగుపరుగున వెళ్లారు. భర్త శిరస్సు ఉరమున చేర్చుకుని పొర్లి పొర్లి ఏడుస్తోంది. తండ్రి ఖడ్గాన్నందుకున్న కుమారుడు వెర్రివానిలా నిలుచుండిపోయాడు.

ఆనందంగా సాగిపోతున్న ఉత్సవాలలో, ఈ విషాదసంఘటన జరగడం ప్రభువుల హృదయాన్ని కలచివేసింది. ప్రజలంతా కళ్లముందు కన్పించేదానిని జీర్ణించుకోలేక సతమతమవుతున్నారు.

తన భర్తను సజీవుణ్ణి చేయమని దేవతలను ప్రార్థిస్తూ, ఏడుస్తున్న వెంకోజీ భార్య అచేతనమయ్యింది. రాజవైద్యుడు పరీక్షించి "ప్రభూ! ఈమె విగతజీవి అయ్యింది" అని ప్రకటించాడు. వెంకోజీ కుమారుడు "నా

మిగతా 11వ పేజీలో....



....6వ పేజీ తరువాయి

తల్లిదండ్రులు లేని లోకంలో నాకింకేం పని. నేనూ వారిననుసరిస్తున్నాను" అని చేతిలో ఉన్న ఖడ్గంతో శిరస్సు ఖండించుకున్నాడు. వారించే వ్యవధి లేకపోయింది ఎవరికీ. తల, మొండెం వేరై రక్తధారతో భూమి తడిసిపోయింది.

కుమారగిరి ప్రభువు, కాటయవేమ భూపాలుడు నిర్విణ్ణులైనారు. పరిస్థితిని గమనించిన సచివుడొకరు తక్షణమే ఆమూడు శవాలకు దహన సంస్కారమొనర్పమని సైనికుల నాదేశించగా, సైనికులు వెంటనే సభాస్థలాన్నంతా శుభ్రపరచి, శ్మశానవాటికలో శాస్త్రోక్తంగా దహనక్రియలు నిర్వహించారు.

ఈ దుస్సంఘటన ప్రభావం నుంచి కోలుకోక ప్రభువులు, ప్రజలు సభలోనే ఆశీనులైనారు. మనసంతా బాధగా వున్నా, విద్యా ప్రదర్శనకై వచ్చినవారిని నిరుత్సాహపరచలేక, మరల ప్రదర్శనలు ప్రారంభించ మన్నారు ప్రభువులు. ప్రజల్లోగూడ ఉత్సాహం కొరవడింది. యాంత్రికంగా, నిరాసక్తంగా పూర్తయ్యాయి ప్రదర్శనలు.

"ఈయేటి ప్రదర్శనలు ఇంతటితో సమాప్తం. జరిగిన సంఘటనకు ప్రభువులెంతో చింతిస్తున్నారు. వెంకోజీ, వాని భార్యాబిడ్డల ఆత్మశాంతికై ఆ పరాత్పరుని ప్రార్థిస్తూ, ప్రజలందరూ తమ ఇండ్లకు చేరవలసిందిగా ప్రభువుల ఆజ్ఞ' అని ప్రకటించారు. కాటయవేమ ప్రభువులు విషణ్ణవదనంతో.

అందరూ నిశ్శబ్దంగా తమ ఆసనాల్లోంచి లేచారు. ఇంతలో ఆకాశంనుండి నాగస్వరం విన్పించింది. ఎక్కడివారక్కడే స్థాణువులైనారు. నాగస్వరం రాను రాను దగ్గరగా వినిపించసాగింది. ప్రజల్లో ఉత్సాహం, ఉద్వేగం కట్టలు తెంచుకుంది. "అదుగో వెంకోజీ!" త్రాడు నుండి క్రిందకు జారుతూ వస్తున్నాడు. సాయంసంధ్యలో, మిట్టమధ్యాహ్నపు సూర్యకాంతిలా వెలుగును విరజిమ్ముతున్నాయి వెంకోజి శరీరం నిండుగా అమర్చుకున్న సువర్ణపుష్పాలు.

ఒక్కుదుటున నేలపైకి దూకిన వెంకోజి, పరుగున వెళ్లి ప్రభువుని పాదాలవద్ద కొన్ని పుష్పాలనుంచి, "ప్రభూ! నేడు నా జన్మ తరించినది. మీ దయవల్ల అత్యంత దుర్లభమైన పుష్పాలను సాధించగలిగాను. నా భార్యాబిడ్డలను పిలిపించండి ప్రభూ! ఒక సువర్ణ సూనమును నాభార్య సిగలో అలంకరించి, తక్కినవన్నీ ప్రభు పాదపద్మములయందు సమర్పించుకుంటాను. వెంటనే పిలిపించండి ప్రభూ!" ఆత్రుతతో వేడుకున్నాడు.

విస్మయం నుండి తేరుకోలేదు కుమారగిరి ప్రభువులు. అందరి పరిస్థితీ అలాగేవుంది. ముందుగా తేరుకున్నది కాటయవేమ భూపాలుడే. "వెంకోజీ! నీవు వెళ్లిన కొద్దిసేపటికి ఆకాశం నుండి రక్తధారలతో గూడి అసంఖ్యాకమైన మాంసఖండాలు నేలరాలాయి. అప్పుడు..."

"అవును ప్రభూ! ఈ పుష్పాలకు కాపలావున్న దేవభటులు నన్నడ్డగించారు. వారిని ఓడించి, పుష్పాలను గ్రహించి రావడం వల్లనే ఇంత ఆలస్యమయ్యింది. ఆ మాంసఖండాలన్నీ వారివే"

"కానీ నీ చేతులు, శిరస్సు, మొండెము, ఖడ్గము కూడా వడ్డాయి"

"అది వారు సృష్టించిన మాయాఫలం ప్రభూ!"

"నీ భార్యాబిడ్డలు మరణించింది నీవేననుకుని దుఃఖభారం వోపలేక స్వర్గస్థులైనారు. కొద్దిసేపటి క్రితమే వారి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. ఆ విషయం నీకు చెప్పలేక బాధపడుతున్నారు ప్రభువులు"


# ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

రాజమండ్రి - 4. ✆ హెడ్ ఆఫీస్: 442846, 475681, 478027, Fax: 463468

## ది. 1-4-2002 నుండి డిపాజిట్లపై అమలులో ఉన్న వడ్డీరేట్లు

| | | | |
|---|---|---|---|
| 15 రోజుల | నుండి | 29 రోజులకు | 5.00% |
| 30 రోజుల | నుండి | 90 రోజులకు | 7.50% |
| 91 రోజుల | నుండి | 179 రోజులకు | 8.25% |
| 180 రోజుల | నుండి | 364 రోజులకు | 8.50% |
| 1 సం॥ | నుండి | 2సం॥ల లోపు | 9.00% |
| 2 సం॥ | నుండి | 3 సం॥ల లోపు | 9.25% |
| 3 సం॥ మరియు పైబడి | | | 9.50% |

సీనియర్ సిటిజన్స్‌కు

కనీస డిపాజిట్ రూ. 10,000/-

కనీస కాలపరిమితి 1 సంవత్సరము



| | |
|---|---|
| 1 సం॥ నుండి 2 సం॥లోపు | 9.50% |
| 2 సం॥ నుండి 3 సం॥లోపు | 9.75% |
| 3 సం॥ మరియు పైబడి | 10% |

15లక్షలు ఆపైన 0.5% అదనపు వడ్డీ ఇవ్వబడును

కరెంట్ ఎక్కౌంట్‌పై 0.5 %

సేవింగ్స్ డిపాజిట్స్‌పై 5.00 %

| బ్రాంచీలు: | ఫోర్ట్ గేట్ | తాడితోట | కాతేరు | స్వరాజ్య నగర్ | జె.ఎన్. రోడ్ |
|---|---|---|---|---|---|
| | ☎ 475682 | ☎ 469654 | ☎ 442782 | ☎ 421823 | ☎ 466084 |

"నిజమా ప్రభూ! ఇదంతా నిజమేనా? ఏలినవారి ఆశ్రయంలోనైతేనే నా భార్య, పుత్రుడు క్షేమంగా ఉంటారని భావిస్తే, ఇక్కడ కూడా నాకన్యాయం జరిగిందా? అయ్యో! భగవంతుడా! నాకేదిదారి? నా యీ సాహసం వృధాయేనా? చూసి, మెచ్చి, చిరునవ్వు చిందించే నా మల్లి, నా బిడ్డ లేకుండా నేనెందుకోసం, ఎవరికోసం బ్రతకాలి" అంటూ ప్రభువుల పాదాల్ని కన్నీటితో కడుగుతున్నాడు వెంకోజీ.

ద్రవించిన హృదయంతో వెంకోజీని లేవనెత్తి, "వెంకోజీ! నీ వేదనను అర్థం చేసుకోగలను. పోయిన వారిని తలుచుకొన్నంతమాత్రాన, వారు తిరిగివస్తారా? వారితో నీ రుణానుబంధం తీరిందని అనుకో. నా కొలువులో దండనాయకుని చేస్తాను. వివాహం చేసుకుని ఇక్కడే వుండిపో" అన్నారు కుమారగిరి ప్రభువు.

"పోయినవారు తిరిగిరారు. సత్యమే. కాని నా సుతుని, మల్లిని రప్పించలేనా ప్రభూ!" అంటూ, "మల్లీ! చిన్నా! త్వరగా రండి. సువర్ణప్రసూనాలు తెచ్చాను. రండి... రండి..." అంటూ పిలిచాడు బిగ్గరగా.

తెల్లబోయి చూస్తున్నారందరూ అతడు ఉన్మాది కాలేదు గదా అని.

దూరంగా మంజీరధ్వనులు, కిలకిల నవ్వులు "మామా" అన్న స్త్రీ స్వరం. "అయ్యా" అంటూ యువకుని మాట విన్పించాయి.

కలవరం రేగింది ప్రజల్లో. ప్రభువులు దిగ్భ్రాంతులైనారు.

వేదిక వెనుకవైపు నుండి పరుగెత్తుతూ వస్తున్నారు వెంకోజీ భార్యా, బిడ్డాను. అందరూ చూస్తుండగానే వెంకోజీ భార్య వచ్చి భర్తను కౌగిలించుకుంది. బిడ్డ పాదాలపైబడ్డాడు.

కలో, నిజమో అర్థంకాని పరిస్థితి అందరిదీ. ఇది సాధ్యమా? కళ్లు తమను మోసం చేయుటం లేదు కదా! చిన్నికృష్ణుని నోటిలో సకలభువనాలను దర్శించిన యశోద మనఃస్థితిలా వుంది అక్కడి సర్వుల స్థితీ. నిరంతరం ఘోషించే సముద్రం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారితే ఎలా ఉంటుందో. అలా వుంది జనసముద్రం. నిశ్చలులైనారు.

## నీతి పతాకం

(స్వర్గీయ మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని పేరడీలు)

ప్రజాగర్జనలు
రథాప్రదర్శనలు
రాజకీయ భజనలు
ఘనంగా చూడకు దేన్ని
రాజకీయ 'కుల'మేనోయి అన్ని!
పోటీ చేసే పొలిటీషియన్
మ్యానిఫెస్టు పేపరు
బ్యాలట్ బాక్స్
నీ వేపే చూస్తుంటాయి
తమ లోతు 'కొనుక్కో'మంటాయి!

అంగబలం
అధికారబలం
ఆర్థికబలం
కాదేదీ 'ఓటు'కు అనర్హం!
ఔనౌను 'సీటు' అనర్థం!!

ఓటరు! సత్తావుంటే చూపించు
'ఓటు'ను అణ్వస్త్రంగా ఉపయోగించు
నాయకుల 'అవినీతి'ని ధ్వంసంచేయి
కాంతివై, క్రాంతివై 'నీతి' పతాకాన్ని ఎగురవేయి!!

**దుర్గుమహంతి మోహనరావు**

నిర్నిమేషులైనారు.

"ప్రభూ!" పిలిచాడు వెంకోజీ.

కుమారగిరి ప్రభువు, కాటయవేమ భూపతులు ఆనందోద్విగ్న మనస్కులై నిర్వికల్పులై ఉన్నారు.

"ప్రభువులకు, ప్రజలకు కొద్దికాలం మనోవేదన కలగడానికి కారణభూతుడనైనందుకు, ముందుగా క్షమాపణలు కోరుతున్నాను. నేను వూరురా ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ తిరిగేవాడిని. నాభార్య, కుమారులకు గూడ ప్రవేశముంది. వసంతోత్సవ సంరంభాల్లో ప్రభుసన్నిధిలో అపూర్వమైన ఇంద్రజాల ప్రదర్శన చేయాలని రెండేండ్లు రేయింబవళ్లు ప్రాచీన గ్రంథాలను శోధించాను. ఆ పరిశీలనలో త్రాడుని ఆకాశంలోకి పంపి, అలాగే శూన్యంలో నిలిపివుంచే విద్య నా దృష్టికి తోచింది. దీనిని నేర్పించే గురువు దొరకలేదు. సాటి ఇంద్రజాలికులు, అలాంటి విద్యను గూర్చి విన్నాము కాని, తెలిసినవారెవరూ ఈ ప్రాంతాల్లో లేరని చెప్పడం వలన, కేవలం గ్రంథ సహాయంతో, స్వయంగా రెండేండ్లు శ్రమించి, సాధించగలిగాను. దానికి మరికొంత ఇంద్రజాలవిద్యను అనుసంధానించి ఈ విధంగా ప్రభువులకు చూపగలిగాము. ప్రభువులు మన్నించి, అనుగ్రహించ ప్రార్థన" ముకుళిత హస్తాలతో వేడుకున్నాడు వెంకోజీ, భార్యాపుత్రులనుసరించగా.

తాము చూసినదంతా ఇంద్రజాల ప్రదర్శనగా అర్థం చేసుకున్న ప్రజల కరతాళధ్వనులు మిన్నుముట్టాయి అభినందన సూచకంగా. హర్షోద్వేగాలతో పులకితులైనారు ప్రభువులు, సభాసదులు.

"వెంకోజీ! మీ ఈ ప్రదర్శన మాకు కలిగించిన ఆనంద విషాదానుభూతులు మమ్మల్నింకా వీడలేదు. ఇదంతా ఇంద్రజాల విద్యా జనితమేనన్న నిజం నమ్మశక్యం కావడంలేదు. ఇంతటి మహత్తర ప్రదర్శన మునుపు ఎన్నడూ మేము చూడలేదు. మున్ముందు తిలకించబోమని చెప్పడానికి కూడా సంకోచించడం లేదు. మీరు కల్గించిన ఈ అనుభూతికి ఏమివ్వగలం? నిస్సంకోచంగా కోరుకో, మా రాజ్యంతో సహా ఏం కావాలన్నా ఇస్తాము" ప్రకటించారు కుమారగిరి ప్రభువులు. కళలయందు వారి అనురక్తి అట్టిది.

"ప్రభువుల ఔదార్యానికి కృతజ్ఞుణ్ణి. బలి, శిబి, దధీచి, దానకర్ణుల మించిన వదాన్యులు ప్రభువులు పొట్టకూటికి విద్యను ప్రదర్శించుకునేవాణ్ణి. నాకు ప్రభువుల అనుగ్రహం చాలు" చెప్పాడు వినయంగా.

"నీ వినయానికి సంతోషించాం. నీ విద్యా ప్రదర్శన విలువకు సరితూగనప్పటికీ, ఫిరంగిపూరం సంస్థానంలోని నుదురుపాడు గ్రామాన్ని అగ్రహారంగా బహుకరిస్తున్నాం. వంశానుగతంగా అనుభవించండి" అంటూ వెంటనే దానపత్రాన్ని వ్రాయించి, చేవ్రాలు చేసి ఇచ్చారు ప్రభువులు.

"మహాప్రసాదం ప్రభూ!" స్వీకరించాడు వెంకోజీ.

ప్రజలందరూ సంతోషాతిరేకంతో గృహాభిముఖులైనారు.

నాటి నుండి తరతరాలుగా వెంకోజి వారసులు కొండవీటి రాజ్యానికి విధేయులై, విద్యావినయ సంపన్నులై, ఇంద్రజాల విద్యను సుసంపన్నం చేశారు. ■

*గమనిక: ఈ కథలో చెప్పబడిన ఇంద్రజాలవిద్యను The Great Indian Rope Trick గా, ఆ రోజుల్లో మనదేశాన్ని సంచారం చేసిన విదేశీయులు గ్రంథస్థం చేశారు. క్రీ॥శ॥ 16వ శతాబ్ది తర్వాత ఈ విద్యాప్రదర్శన జరిగిన దాఖలాలు లేవు. స్వర్గీయ పి.సి. సర్కార్ సీనియర్‌గారు ప్రయత్నించి కృతకృత్యులు కాలేకపోయినప్పటికీ, శ్రీ పి.సి. సర్కార్ జూనియర్‌గారు ప్రయత్నిస్తున్నట్టు వార్తాపత్రికల ద్వారా తెలుస్తున్నది. ఈ అత్యద్భుత, పురాతన విద్యను వారు సాధించగలరని ఆశిద్దాం.*